స్మృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దాలి

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, జూలై 4: అమరవీరుల స్తూపం వద్ద నిర్మిస్తున్న అమరవీరుల స్మృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపంతో పాటు కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించారు. అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసే స్మృతి వనం స్థలాన్ని పరిశీలించారు. స్మృతి వనం నిర్మాణం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పనులు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నాగోబా ఆలయాన్ని సందర్శించి దర్బార్ హాల్‌లో మెస్రం వంశీయులతో కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రభుత్వం నాగోబా ఆలయానికి మంజూరు చేసిన కోటి రూపాయలతో ఎలాంటి నిర్మాణ పనులు చేయాలనేది మెస్రం వంశీయులు నిర్ణయించి తెలిపిన తర్వాతనే పనులు చేయాలని అధికారులకు సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ధర్మాశాలతో పాటు భక్తులు విశ్రాంతి పొందే విధంగా ప్రత్యేక రూములు నిర్మాణం చేయాలని మెస్రం వంశీయులు కోరడం జరిగింది. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ భీంరావ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్‌పటేల్, చిన్నుపటేల్, కోసే రావ్‌కటోడ, బాదిరావ్, శేఖర్ బాబు, తుకారాం, ఆనంద్‌రావ్, అధికారులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: స్మృతి వనం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్

మండలాభివృద్ధికి కృషి చేయాలి

నార్నూర్, జూలై 4 : సమష్టి కృషితో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రభుత్వ దవాఖాన వరకు ర్యాలీ తీశారు. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోడ్ల, నీటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులు వివరించారు. అంగన్‌వాడీ, మహిళా సంఘాలు, వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసి స్టాళ్లను ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, జడ్పీ చైర్మన్‌తో కలిసి పరిశీలించారు. డ్రాయింగ్ విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు పని చేయాలని సూచించారు. రాష్ట్ర, కేంద్ర నిధులతో అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. పదవీ కాలం ముగిసిన జడ్పీ చైర్మన్, ఎంపీపీ, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నీతి అయోగ్ రెప్రజెంటేటివ్ బిప్లబ్ నందే, మహిళ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, డీఆర్డీవో సాయన్న, మాజీ ఎంపీపీ మోతుబాయి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి పుల్లయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో మనోహర్, తహసీల్దార్ జాడి రాజలింగం, ఎంపీడీవో జవహర్, ఎంఈవో రాపెల్లి ఆశన్న, ఏవో గిత్తే రమేశ్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఘన సన్మానం

జోగు రామన్నను సన్మానిస్తున్న పాకాల రాంచందర్

నిర్మల్ అర్బన్, జూలై 4: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జోగు రామన్న జన్మదినం సందర్భంగా గురువారం ఆదిలాబాద్‌లోని తన నివాసంలో ఆయనను పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. దంపతులను శాలువాతో సన్మానించారు.

దొడ్డి కొమురయ్య ఆశయాలు నెరవేర్చాలి

నిర్మల్ అర్బన్, జూలై 4 : దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసి ఆయన ఆశయాలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వర్ అన్నారు. గురువారం నిర్మల్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజేశ్వర్, సట్వాజీ, సంగారి శ్రీనివాస్, సాయినాథ్, కామాజీ, భోజన్న, పాల్గొన్నారు.

అప్రెంటీస్ జాబ్ మేళాకు స్పందన

నిర్మల్ చైన్‌గేట్, జూలై 4: నిర్మల్‌లోని సత్యసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఐటీసీ కంపెనీ హైదరాబాద్ వారు అప్రెంటీస్ జాబ్‌మేళా నిర్వహించారు. ఐటీసీ కంపెనీ సిబ్బంది సూర్య భగవాన్ కంపెనీ ఉత్పత్తులపై వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు వేతనం, ఇతర సౌకర్యాలపై తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సురేశ్‌బాబు, డైరెక్టర్ మురళీకృష్ణ, కళాశాల సమన్వయకర్త విజయరామ రాజు, ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ కేసులో ఇద్దరి రిమాండ్

భైంసా, జూలై 4 : కుంసర గ్రామంలో ముగ్గురు వ్యక్తుల మధ్య వాగ్వాదం ఇరు వర్గాల ఘర్షణకు దారి తీసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న కుంసర గ్రామంలో అబ్దుల్ అజీజ్, నవీన్ రెడ్డి, రితేశ్ రెడ్డి మధ్య గొడవ ఘర్షణకు దారి తీసింది. దీంతో అబ్దుల్ అజీజ్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు ఘర్షణకు కారణమైన ఇద్దరిని అరెస్టు చేసి 14రోజుల జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐలు రాజారెడ్డి, నైలు ఉన్నారు.

పదవిలో ఉన్నా లేకున్నా సేవలందిస్తా

కుభీర్, జూలై 4: పదవిలో ఉన్నా లేకున్నా గ్రామాభివృద్ధికి తనవంతు సేవలందిస్తానని పల్సి ఎంపీటీసీ కొట్టె రాజమణి-హన్మాండ్లు అన్నారు. పదవీ కాలం ముగియడంతో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో దంపతులను శాలువాతో సన్మానించారు. జేపీఎస్‌లు పాండురంగ్, రాజన్న, అవినాశ్ గ్రామస్తులు ఉన్నారు.

వనమహోత్సవాన్ని పటిష్టంగా నిర్వహించండి

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూలై 4 : వన మహోత్సవ కార్యక్రమానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వనమహోత్సవ కార్యక్రమ అమలు, శాఖల వారీగా లక్ష్యం తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. జియో ట్యాగింగ్, నాటిన మొక్కల వివరాలను రోజువారీగా ఆన్‌లైన్‌నో నమోదు చేయాలని అన్నారు. మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయని లక్ష్యానికి మించి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అటవీ శాఖ అధికారులు ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ప్రసాద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజు, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్, జూలై 4: ఖానాపూర్ మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ కార్యవర్గాన్ని గురువారం పట్టణంలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వరాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు కాశినాథ్, కార్యదర్శి శ్రీనివాస కృష్ణాస్వామి, సీనియర్ ఫొటోగ్రాఫర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా గుగ్గిళ్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా పెద్ది నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా వరుణ్, కోశాధికారిగా రాజేశ్, ప్రచార కార్యదర్శిగా సతీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎలిగేటి మల్లేశ్, కోర్ కమిటీ అధ్యక్షుడిగా లవకుమార్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల ఫోటో, వీడియోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

లాక్కిషా బంజార అడుగుజాడల్లో పయనించాలి

నార్నూర్, జూల్ 4 : బంజార పోరాట యోధుడు లాక్కిషా బంజార అడుగుజాడల్లో పయనించాలని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం మండల కేంద్రం లో లాక్కిషా బంజార 445వ జయంతిని ఘనంగా నిర్వహించారు. లాక్కిషా బంజార విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బంజార సంఘ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్, ప్యాక్స్ చైర్మన్ సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ నాగోరావ్, నాయకులు శివాజీపటేల్, యశ్వంత్‌రావు, దేవికాబాయి, బ్రిజులాల్, లోకండే దేవ్‌రావు, లోకండే చంద్రశేఖర్, పరమేశ్వర్, బానోత్ గజానంద్‌నాయక్, కాంతారావు, దస్తగిరి, సుభాష్, మహేందర్, సయ్యద్‌ఖానీం, మహ్మద్‌ఖురేషి, అశోక్, హైమద్, మోహన్ పాల్గొన్నారు.

లాక్కిషా బంజార విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఆపన్నహస్తం కోసం ఎదురు చూపు

బోథ్, జూలై 4 : బోథ్‌లోని వెలుగు ఐకేపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లారం అశోక్ ఇటీవల ద్విచక్రవాహనంపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, చెవుల నుంచి రక్తం పోతుందని వైద్యులు తెలిపారు. వెంటనే ఆపరేషన్ చేయాలని, ఆపరేషన్‌కు రూ.2 లక్షల 50 వేలు అవుతుందని తెలిపారు. మానవ దృక్పథంతో సహాయం చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు. గూగుల్ పే, ఫోన్ పే రవి ఫోన్ నంబర్‌కు 8247850325 ఆర్థికసాయం అందించాలని కోరారు.

చిత్రం గీసి.. శుభాకాంక్షలు తెలిపి..



మాజీ మంత్రి చిత్రం గీస్తున్న గట్టు రాజు

తాంసి, జూలై 4 : మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన కళాకారుడు గట్టు రాజు సందర్భానికి తగ్గట్టుగా చిత్రాలు గీస్తూ అందరిని అబ్బురపరుస్తాడు. గురువారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పుట్టిన రోజు సందర్భంగా ఆయన చిత్రాన్ని గీసి వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మాజీమంత్రి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి

ఎస్పీకి మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న పోలీస్ సిబ్బంది

జైనథ్, జూలై 4: మహారాష్ట్రతో సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉన్నందున ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా జైనథ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా పెన్‌గంగ పరివాహక ప్రాంతంలో గ్రామాలను సందర్శించి విపత్తుల సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. జైనథ్ సర్కిల్ పరిధిలో ఉన్న కేసుల రికార్డులు పరిశీలించారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సెంట్రల్ వాటర్ కమిషన్ కార్యాలయాన్ని, కోరాటా-చానకా ప్రాజెక్టును సందర్శించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పదవీ విరమణకే...ప్రజా సేవకు కాదు

జడ్పీటీసీ సంతపూరి శారదశ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి

దస్తురాబాద్, జూలై 4 : ప్రజాప్రతినిధులకు విరమణ అనేది పదవికే కానీ ప్రజా సేవకు కాదు అని దస్తురాబాద్ జడ్పీటీసీ సంతపూరి శారదశ్రీనివాస్ అన్నారు. నిర్మల్‌లో గురువారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీ పదవీ విరమణ పొందిన నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తామన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది జడ్పీటీసీ దంపతులకు శాలువాతో సన్మానించారు.

ఎంపీపీకి సన్మానం

ఎంపీపీని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, జూలై 4: ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్‌ను గురువారం మండలంలోని లక్కారంలోని రాజ్‌దేవుషా గూడలో వివిధ గ్రామలకు చెందిన గ్రామ పెద్దలు సన్మానించారు. ఎంపీపీ పదవీ కాలం నేటితో ముగియనుండడంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆత్రం నాగోరావ్, గోవింద్‌రావ్, జుగాదిరావ్, జగనాథ్ రావ్, వెడ్మ భీంరావ్, సుంగు, ప్రభాకర్, గంగారాం పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నర్సాపూర్(జీ), జూలై 4: నర్సాపూర్(జీ) పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ గంగారెడ్డి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ సిబ్బంది పేరేడు నిర్వహించి గౌరవ వందనం స్వీకరించారు. రికార్డులను పరిశీలించి కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేసేలా చూడాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్,ఎస్ఐ హన్మాండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ బ్రోకింగ్ మోసాలపై సెబీ నజర్

సంస్థాగత యంత్రాంగాన్ని తప్పనిసరి చేస్తూ సర్క్యులర్



న్యూఢిల్లీ, జూలై 4: సెక్యూరిటీస్ మార్కెట్‌లో మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం మోసాలను కనిపెట్టి, అరికట్టేందుకు స్టాక్ బ్రోకర్లకు ఓ సంస్థాగత యంత్రాంగాన్ని తప్పనిసరి చేస్తూ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గురువారం ఓ సర్క్యులర్‌ను విడుదల చేసింది. సవరించిన సెబీ స్టాక్ బ్రోకర్ల రెగ్యులేషన్స్-2024లో భాగంగా ట్రేడింగ్, అంతర్గత కార్యకలాపాల పర్యవేక్షణకు నిఘా వ్యవస్థ, విజిల్-బ్లోయర్ విధానాన్ని పరిచయం చేయడం వంటి సూచనలను ఈ సర్క్యులర్‌లో మార్కెట్ రెగ్యులేటర్ చేసింది. మార్కెట్ సమగ్రత, మదుపరుల ప్రయోజనాల రక్షణే ధ్యేయంగా ఈ రెగ్యులేషన్స్‌ను సవరించిన విషయం తెలిసిందే. కాగా, బ్రోకర్స్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ ఫోరం (ఐఎస్ఎఫ్) కార్యాచరణ పద్ధతులను అనుసరించే ఈ సూచనలు చేసినట్టు సెబీ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఇక 50వేలకుపైగా యాక్టీవ్ యూనిక్ క్లయింట్ కోడ్స్ (యూసీసీ) ఉన్న బ్రోకర్లు 2025 జనవరి 1కల్లా సెబీ తాజా నిబంధనలను అమల్లోకి తీసుకురావాలి. 2వేలలోపు యూసీసీలున్న బ్రోకర్లు 2026 ఏప్రిల్ 1కల్లా.. 2001 నుంచి 50వేలదాకా యూసీసీలున్న బ్రోకర్లు 2025 ఏప్రిల్ 1కల్లా సెబీ నిబంధనల్ని ఆచరణలో పెట్టాల్సి ఉన్నది. అలాగే క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు ఈ ఏడాది ఆగస్టు 1కల్లా ఈ సర్క్యులర్‌ను అమలు చేయాల్సి ఉంటుంది. ఈ సర్క్యులర్ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజీలు సైతం తమతమ వెబ్ సైట్లలో సెబీ పెట్టాలన్నది.

మళ్లీ 73 వేలు దాటిన పుత్తడి

రూ.530 పెరిగిన తులం ధర

న్యూఢిల్లీ, జూలై 4: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ధరలు భారీగా పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పుత్తడి ధర మళ్లీ రూ.73 వేల మార్క్‌ను అధిగమించింది. తులం ధర రూ.530 అధికమై రూ.73,080కి చేరుకున్నది. అంతకుముందు ధర రూ.72,550గా ఉన్నది. పసిడితోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,200 అధికమై రూ.92,500 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.710 పుంజుకొని రూ.73,090కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.650 అధికమై రూ.67 వేలుగా నమోదైంది. అలాగే రూ.1,500 అధికమైన కిలో వెండి రూ.96 వేల నుంచి రూ.97,500కి ఎగబాకింది. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒకేరోజు 16 డాలర్లు పెరిగి 2,355 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా ధరలు పుంజుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. అలాగే వెండి కూడా 29.80 డాలర్ల నుంచి 30.25 డాలర్లకు ఎగబాకింది. ఫెడరల్ రిజర్వు మరోసారి వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయంటూ వచ్చిన అంచనాలు బంగారం పెరగడానికి ప్రధాన కారణమన్నారు.

వాణిజ్య

ఈఈఎస్ఎల్‌తో హైదరాబాదీ వ్యాపారీ

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇంధన సామర్థ్య పరిష్కారాలను పెంపొందించడానికి ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మహిళా వ్యాపారవేత్త వధ్య పద్మ ఒప్పందం కుదుర్చుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మెరుగైన ఆర్థిక వృద్ధి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు మద్దతుగా నిలవడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ ఎంవో యూతో రిటైల్ స్టోర్లను స్థాపించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు సమర్థమైన ఇంధన సాంకేతికలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో భారీ ఎత్తున రిటైల్‌స్టోర్లను విస్తరించాలని ఈఈఎస్ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నది.

సిగ్నిటీలో కోఫోర్జ్‌కి వాటా

న్యూఢిల్లీ, జూలై 4:హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల సంస్థ సిగ్నిటీ టెక్నాలజీలో 11 శాతం వాటాను చేజిక్కించుకున్నది డిజిటల్ సేవలు అందిస్తున్న కోఫోర్జ్. బహిరంగ మార్కెట్లో ఒక్కో షేరుకు రూ.1,412.25 చొప్పున 30,21,293 షేర్లను కొనుగోలు చేయడానికి రూ.426.68 కోట్ల నిధులను వెచ్చించింది.

బుల్ రన్.. తగ్గేదేలే!

లక్ష పాయింట్లకు సెన్సెక్స్ ● వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా సాధ్యమేనన్న అంచనాలు

ముంబై, జూలై 4: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్.. వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా లక్ష పాయింట్ల మార్కును చేరుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. 1979 ఏప్రిల్ 1న బేస్ వాల్యూ 100 పాయింట్లతో సెన్సెక్స్ మొదలైంది. ఈ క్రమంలో గురువారం తొలిసారి 80,000 పాయింట్ల ఎగువన ముగిసింది. దీంతో గడిచిన 45 ఏండ్ల కాలంలో వార్షిక చక్ర వృద్ధిరేటు (సీఏజీఆర్) 15.9 శాతంగా ఉన్నది. ఈ వ్యవధిలో సూచీ ఏకంగా 800 రెట్లు ఎగబాకడం గమనార్హం. మరో ఏడాదిన్నరలో 20,000 పాయింట్లు ఎగిసి లక్ష పాయింట్లను తాకుతుందని చెప్తున్నారు.

ఐదేండ్లలో 40 వేల పాయింట్లు

గడిచిన ఐదేండ్లలో సెన్సెక్స్ 40,000 పాయింట్లు పెరిగింది. కేవలం 3 నెలల్లోనే 5,000 పాయింట్లు పుంజుకోవడం విశేషం. కాగా, ప్రతీ ఐదేండ్లకు సెన్సెక్స్ రెట్టింపు స్థాయిలో పాయింట్లను పెంచుకుంటూపోతున్నదని దలాల్ స్ట్రీట్ సీనియర్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకుడు రాందేవ్ అగర్వాల్ అంటున్నారు. ఈ క్రమంలోనే 2029-30 నాటికి సెన్సెక్స్ 1,50,000 పాయింట్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేస్తున్నారు. 'భారతీయ కార్పొరేట్ రంగం లాభాలు గత మూడు దశాబ్దాలకుపైగా కాలంలో సుమారు 17 శాతం చక్ర వృద్ధిని సాధించాయి. ఒకవేళ ప్రస్తుత ప్రైస్-టు-ఎర్నింగ్స్ లెవల్స్ 25 రెట్లు ఇలాగే కొనసాగితే సెన్సెక్స్ చక్ర వృద్ధిని 15 శాతంగా భావించవచ్చు. అంటే ప్రతీ ఐదేండ్లకు రెట్టింపు అవుతుందన్నమాట' అని అన్నారు. ప్రముఖ మార్కెట్ మదుపరి మార్క్ మోబియస్ స్పందిస్తూ.. భారత జీడీపీ 7 శాతంతో, కంపెనీలు 14-15 శాతం వృద్ధితో పయనిస్తే.. సెన్సెక్స్ కూడా వచ్చే 10 ఏండ్లలో ఇదే జోష్‌తో పరుగులు పెట్టగలదన్నారు.

80 వేలపైన తొలిసారి..

బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారి 80,000 మార్కుకు ఎగువన ముగిసింది. గురువారం 62.87 పాయింట్లు పెరిగి మునుపెన్నడూ లేని విధంగా 80,049.67 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 80,392.64 వద్దకు ఎగిసి ఇంట్రా-డే హై రికార్డునూ నెలకొల్పింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 15.65 పాయింట్లు అందుకుని మొదటిసారి 24,302.15 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 24,401 పాయింట్లను తాకి సరికొత్త రికార్డు సృష్టించింది. ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా మోటర్స్, సన్ ఫార్మా, కొటాక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు మదుపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, ఐటీ, టెక్నాలజీ, ఆటో, టెలికం సూచీలు పుంజుకున్నాయి.



45 ఏండ్లలో 800 రెట్లు ఎగిసిన సెన్సెక్స్

మరో ఏడాదిన్నరలో లక్ష పాయింట్లకు చేరవచ్చన్న అంచనాలు

వాస్తవం		అంచనా	
సంవత్సరం	సెన్సెక్స్	సంవత్సరం	సెన్సెక్స్
ఏప్రిల్ 1979	100	ఏప్రిల్ 1979	100
జూలై 2024	80.000	డిసెంబర్ 2025	1,00.000

చక్ర వార్షిక వృద్ధిరేటు 15.9%

వ్యవధి: 45 ఏండ్ల 3 నెలలు | వ్యవధి: 46 ఏండ్ల 8 నెలలు

బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ

మైలురాళ్లు	చేరిన సంవత్సరం	పట్టిన కాలం
రూ.100 లక్షల కోట్లు	మార్చి 2014	
రూ.200 లక్షల కోట్లు	ఫిబ్రవరి 2021	6 ఏండ్ల 11 నెలలు
రూ.300 లక్షల కోట్లు	జూలై 2023	2 ఏండ్ల 5 నెలలు
రూ.400 లక్షల కోట్లు	ఏప్రిల్ 2024	9 నెలలు
రూ.447 లక్షల కోట్లు	జూలై 2024	3 నెలలు

రూ.447.30 లక్షల కోట్లకు..

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గతంలో ఎప్పుడూ లేనంతగా రూ.447.30 లక్షల కోట్లకు చేరుకున్నది. గురువారం మార్కెట్ ట్రేడింగ్ ముగిసే నాటికి రూ.4,47,30,452.99 కోట్ల (5.36 ట్రిలియన్ డాలర్లు)కు వెళ్లింది. ఈ ఒక్కరోజే రూ.2 లక్షల కోట్లు ఎగిసింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ 0.62 శాతం, 0.60 శాతం చొప్పున పెరిగాయి.

తగ్గిన సిమెంట్ ధర

బస్తాపై రూ.20 వరకు

హైదరాబాద్, జూలై 4: సిమెంట్ ధరలు తగ్గుముఖం పట్టాయి. వర్షాకాలం కావడంతో డిమాండ్ అంతకంతకు పడిపోవడంతో సిమెంట్ తయారీ సంస్థలు తమ ధరలను తగ్గించాయి. దీంతో రాష్ట్రంలో బస్తా సిమెంట్ ధర రూ.20 వరకు తగ్గించాయి. ప్రతియేటా వర్షాకాలంలో ధరలు తగ్గడం సహజమని డీలర్ వెల్లడించారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం